RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 134 ఎడిటర్ : నీలి రాముసుబ్బయ్య, పేజీలు : 4 వెల రూ. 2 గురువారం -24 - సెప్టెంబర్ - 2026

Published From :Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

ఉత్తరాంధ్ర వైపు వేగంగా కదులుతున్న తీవ్ర వాయుగుండం.. ఈ రాత్రికి తీరం దాటే అవకాశం



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరం వైపు వేగంగా పయనం

ఈ రాత్రికి కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం

విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుందని అంచనా

తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తం

కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు? క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

'సర్' సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నామన్న ఈసీ

ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చెప్పారన్న వార్తలను ఖండించిన అధికారులు

కొన్ని అంశాలపై వారు పరిశీలనలు మాత్రమే చేశారని వెల్లడి

14 సందర్భాల్లో అభ్యంతరాలంటూ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం

ఓటర్ల జాబితా కచ్చితత్వమే 'సర్' లక్ష్యమని స్పష్టీకరణ



ఏపీలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు.. క్యాబినెట్ ఆమోదం

అమరావతి: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

- 'సర్' వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- 'ఓటు చోరీ' రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య
- ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు
- 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం
- ఎలాంటి అధికారిక భిన్నాభిప్రాయం లేదని ఈసీ స్పష్టీకరణ

రాయలసీమకు లక్ష కోట్ల వరం.. అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు

- ★ నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ★ రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ
- ★ వరుస కార్యక్రమాలతో ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు బిజీ బిజీ



అమరావతి: దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ మిగతా 2 లో

తీవ్ర వాయుగుండం.. సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా వరకు ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉంది

కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది

కూటమి క్లీన్ స్వీప్ చేయాలి: మంత్రుల భేటీలో నారా లోకేశ్

- అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు..
- ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని వ్యాఖ్య
- ఉపాధ్యాయులపై దాడి చేసిన వారు పరారయ్యారని ఎద్దేవా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని మిగతా 2 లో

రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది జూరాల నీటి విడుదలపై కేటీఆర్

జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం

- పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్
- రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య

హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మిగతా 2 లో

రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లల ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే మార్పు

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది



ప్రభుత్వ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకే పెద్దపీట

అట్రాసిటీస్ బాధితులకు సత్వర న్యాయం

ఉన్నత స్థాయి కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి

హైదరాబాద్: విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అణచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి మిగతా 2 లో

'ఏఐ'కి కొత్త పేరు పెట్టిన ట్రంప్.. ఇక నుంచి అలాగే పిలవాలట!

- ఏఐకి బదులు 'సూపర్ ఇంటెలిజెన్స్' అని పిలవాలన్న ట్రంప్
- ఆర్టిఫిషియల్ అంటే నకిలీ అనే భావన వస్తోందని వ్యాఖ్య
- అమెరికా ప్రభుత్వ పత్రాల్లో 'సూపర్ ఇంటెలిజెన్స్'నే కొనసాగిస్తామని ప్రకటన
- ఇతర దేశాలు కూడా ఇదే అనుసరించాలని సూచన
- ఏఐపై నియంత్రణకు నో చెప్పిన ట్రంప్

ఉత్తరాంధ్ర వైపు వేగంగా కదులుతున్న తీవ్ర వాయుగుండం.. ఈ రాత్రికి తీరం దాటే అవకాశం

ఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకనుంది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ పరిణామంతో కోస్తా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రస్తుతం ఈ వాయుగుండం గత ఆరు గంటలుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి, ఈ రోజు రాత్రి 8:30 నుండి 11:30 గంటల మధ్య విశాఖపట్నం - గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. ముఖ్యంగా కళింగపట్నానికి అత్యంత సమీపంలో ఇది భూభాగాన్ని తాకుతుందని అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో కూడా ఇది తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధం చేశారు.

'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం'
ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

ఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానించారు. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వీడియో ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవల సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తున్నాయని, ప్రజల దృష్టి మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులను గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టపరమైన కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది
జూరాల నీటి విడుదలపై కేటీఆర్

హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముట్టడించడం వల్లే దిగొచ్చిందని, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ, ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు?
క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

ఢిల్లీ: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డుల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. ఇటీవల 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ సమావేశాల్లో వారి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉంటుందని ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

తీవ్ర వాయుగుండం..
సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

అమరావతి: రాష్ట్రానికి తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం-కళింగ మధ్య తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 85 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా వరకు ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని... లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, నదులు, వాగులు, వంకల్లో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. సీఎస్, డీజీపీతో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించిన సీఎం.. రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. 261 మండలాల్లో వర్షాలపై ప్రత్యేక అంచనాలు ఉన్నందున 24, 25 తేదీల్లోనూ అప్రమత్తత కొనసాగించాలని సూచించారు.

విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే మార్పు

మొదటి పేజి తరువాయి

రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, బాధితులకు ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులతో కలిసి సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతోపాటు.. చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం' అమలుపై 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక... సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

బాధితులకు సత్వరమే నష్టపరిహారం

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు గత ఐదేళ్లలో తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. బాధితులకు నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలి. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలి. మానవీయ కోణంలో స్పందించి.. సకాలంలో సహాయం, పునరావాసం అందేలా చూడాలి" అని ఆదేశించారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను సీఎం ప్రస్తావించి.. బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు నిర్దేశించారు.

జనాభా దామాషా ప్రకారం నిధులు

"దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతీ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాం. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16% ఉంటే.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో 31% మంది ఎస్సీలే. ఎస్టీల జనాభా 10% ఉంటే.. వారికి 17% ఇళ్లను మంజూరు చేశాం. 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోంది. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుంది. సమాజంలో అసమానతలకు, అణచివేత వంటి రుగ్మతలకు విద్యతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పిల్లలను చదువుతో పాటు క్రీడలవైపు ప్రోత్సహించాలి" అని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గుణాత్మక మార్పే లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఆత్మగౌరవం, సమానత్వం, విద్య, ఉపాధి, సంక్షేమం ద్వారా దళిత, గిరిజన వర్గాల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం-1989 అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష అనంతరం మంగళవారం సచివాలయంలో మంత్రి లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడుతూ... "తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం.. ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదు? దళిత వర్గాలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు జరిగినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల స్పీకర్‌ను అవమానించిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు స్పందించకపోవడం దురదృష్టకరం. భారాసలోని దళిత నాయకులు కూడా స్పందించకపోవడం శోచనీయం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లకు నిధుల కొరత లేకుండా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని పేర్కొన్నారు.

రాయలసీమకు లక్ష కోట్ల వరం.. అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

మొదటి పేజి తరువాయి

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తూనే, మరోవైపు ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతాల్లో సంపద సృష్టించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ హబ్ ప్రధాన ఉద్దేశం. ఇదే కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.

వరుస కార్యక్రమాలతో సీఎం బిజీ

ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటూ తీరిక లేకుండా గడపనున్నారు. సెప్టెంబర్ 29: ఉదయం విజయవాడలో జరిగే ఇస్రో కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించే 'పల్లె పండుగ'కు హాజరవుతారు.

సెప్టెంబర్ 30: విజయవాడలో 24 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అక్టోబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు.

అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఉదయం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం విజయవాడలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్టోబర్ 3: విజయవాడలో జరిగే పాన్ ఐఐటీ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ వరుస కార్యక్రమాలతో సీఎం ఐదు రోజుల పాటు ప్రజలతో మమేకం కానున్నారు.

'ఏఐ'కి కొత్త పేరు పెట్టిన ట్రంప్..
ఇక నుంచి అలాగే పిలవాలట!

ఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ)కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త పేరు పెట్టారు. ఇకపై 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'కు బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్' (ఎస్ఐ) అనే పదాన్ని వాడాలని నిర్ణయించారు. 'ఆర్టిఫిషియల్' అంటే నకిలీ అన్న భావన వస్తోందని.. ఈ సాంకేతికత నిజమైనదే కాబట్టి ఆ పేరు సరైంది కాదని ట్రంప్ అన్నారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఇకపై అమెరికా ప్రభుత్వ పత్రాల్లో 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదమే కనిపిస్తుందని చెప్పారు. ఇతర దేశాలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఏఐపై ప్రపంచవ్యాప్తంగా నియంత్రణ తీసుకురావాలన్న ప్రయత్నాలను ట్రంప్ వ్యతిరేకించారు. సాంకేతికత అభివృద్ధిని అడ్డుకునే అంతర్జాతీయ వ్యవస్థను అమెరికా అంగీకరించబోదని స్పష్టం చేశారు. అయితే ఏఐతో కొత్త సవాళ్లు వస్తాయని చెప్పారు. అవసరమైనప్పుడు న్యాయశాఖ, చట్టాన్ని అమలు చేసే ఇతర సంస్థలు చర్యలు తీసుకుంటాయని తెలిపారు. అత్యాధునిక ఏఐ, రోబోలు మానవాళికి పెను ముప్పుగా మారొచ్చన్న హెచ్చరికలను ట్రంప్ కొట్టిపారేశారు. ఏఐ భవిష్యత్తులో పారిశ్రామిక విప్లవం, ఇంటర్నెట్ కంటే పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. ఈ సాంకేతికత అభివృద్ధిని అడ్డుకునే చర్యలు తీసుకోబోమని చెప్పారు. ఏఐలో ఏ దేశం ముందుంటే దానిదే ప్రపంచంలో పైచేయి అవుతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రస్తుతం చైనా కంటే చాలా ముందుందని అన్నారు. ఈ ఆధిక్యాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అయితే 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పేరును అన్ని ఏఐ వ్యవస్థలకు వాడతారా? అత్యాధునిక మోడళ్లకు మాత్రమే పరిమితం చేస్తారా? అన్నది ట్రంప్ స్పష్టంగా చెప్పలేదు. ప్రభుత్వ శాఖల్లో ఈ మార్పు ఎలా అమలవుతుందన్నదానిపైనా వివరాలు వెల్లడించలేదు.

రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

హైదరాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

ఏపీలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు..
క్యాబినెట్ ఆమోదం

అమరావతి: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో
రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

ఢిల్లీ: రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేద్దాం

అమరావతి: 'సాధారణ ఎన్నికలు ప్రజల కోసం..స్థానిక ఎన్నికలు పార్టీ బలోపేతం కోసం.. ఆత్మాభిమానం తగ్గని రీతిలోనే జనసేన పోటీ చేస్తుంది. కూటమి ధర్మాన్ని పాటిస్తాం. అన్ని చోట్లా పొత్తులతోనే పోటీ చేస్తాం. అవసరమైతే మిత్రధర్మం పాటిస్తూనే పార్టీ బలంగా ఉందని కార్యకర్తలు నమ్మిన చోట పోటీకి దిగుతాం' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడలో మంగళవారం జనసేన పార్టీ రాష్ట్ర స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అంతర్గతంగా నిర్వహించారు. పార్టీ నాయకులు తెలిపిన సమాచారం మేరకు అందులో పవన్‌కల్యాణ్ ప్రసంగం ఇలా ఉంది. 'స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలి. లోక్‌సభ స్థానాల వారీగా నియమించిన పార్టీ కమిటీలు మనం ఎక్కడెక్కడ బలంగా ఉన్నామో గుర్తించి సరైన నివేదికలు ఇవ్వాలి. పొత్తు ధర్మం పాటిస్తూనే మనం గెలిచే అన్ని స్థానాల్లోనూ పోటీ చేద్దాం. 2024 సాధారణ ఎన్నికలు రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల బాగు కోసమని దృష్టిలో ఉంచుకుని జనసేన కొన్ని త్యాగాలు చేసింది. ఈ స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసుకుందాం. కార్యకర్తలు, పార్టీ నాయకులు ఏం చెబితే ఆ ప్రకారమే ముందుకు వెళ్దాం. పార్లమెంటరీ కమిటీలు ముందుగానే వాస్తవిక అంచనాలతో కచ్చితమైన అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేస్తే స్థానిక ఎన్నికల్లోనూ వందశాతం విజయం సాధించడం పెద్ద కష్టం ఏమీ కాదు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. స్థానిక ఎన్నికల పొత్తులో 15శాతం అంటూ పర్సంటేజీల లెక్కలపై కొన్ని ప్రచారాలు జరుగుతున్నాయని, అవి నిజంగా వారు మాట్లాడారో లేదో తనకు తెలియదని అన్నారు. 'మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల స్థాయిలోనే స్థానిక ఎన్నికల సర్దుబాట్లు జరిగిపోవాలి. తప్పనిసరి పరిస్థితులుంటే నేనే ముఖ్యమంత్రితో మాట్లాడతా. సాధారణ ఎన్నికల్లో నాయకుల గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల ఎదుగుదలకు అందరూ పని చేయాలి. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించవద్దు. పురపాలక, నగరపాలక సంస్థలు, పరిషత్తు ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తీసుకోవాలి. ఈ ఎన్నికల ఫలితాలు జనసేన గౌరవం పెంచేలా ఉండాలి' అని అన్నారు. పార్టీలోకి వచ్చేందుకు అనేక చోట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, సరైన వారిని పార్టీలోకి ఆహ్వానించాలని పార్టీ అధినేత సూచించారు. తొలుత పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ఇటీవల విశాఖలో తాను మాట్లాడిన కొన్ని అంశాలను కార్యకర్తలు అపార్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. పార్టీ విజయానికి నిబద్ధతతో పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, బాలశౌరి, లింగమనేని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హానికర వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..!

ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 23 : హానికర వ్యర్థాల నిర్వహణ, రవాణా, ప్రీ-ప్రాసెసింగ్, సహ-ప్రాసెసింగ్ ప్రక్రియల్లో పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ సంస్థ (ఏపీఈఎంసీఎల్) చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. బుధవారం వైఎస్ఆర్ కడప జిల్లాలోని భారతి సిమెంట్స్ పరిశ్రమతో పాటు ముద్దనూరు మండలంలోని జీఎం ఎకో సర్వీసెస్ ఎల్ఎల్పీ పరిశ్రమలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హానికర వ్యర్థాల నిర్వహణ, ప్రీ-ప్రాసెసింగ్, సహ-ప్రాసెసింగ్ ప్రక్రియలను పరిశీలించారు. భారతి సిమెంట్స్లోని హానికర వ్యర్థాల సహ-ప్రాసెసింగ్ విభాగాన్ని పరిశీలించిన చైర్మన్, వ్యర్థాలను నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా లేదా అనే

అంశాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, వ్యర్థాల నిర్వహణ విధానాలను పరిశీలించారు. అనంతరం ముద్దనూరు మండలంలోని జీఎం ఎకో సర్వీసెస్ ఎల్ఎల్పీ హానికర వ్యర్థాల ప్రీ-ప్రాసెసింగ్ కేంద్రాన్ని సందర్శించి, ప్రీ-ప్రాసెస్ చేసిన వ్యర్థాలను నిబంధనల ప్రకారం అనుమతించబడిన సిమెంట్ పరిశ్రమలకు తరలిస్తున్నారా లేదా అనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, నిబంధనల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెండు పరిశ్రమలకు సంబంధించిన హానికర వ్యర్థాల నిర్వహణ వివరాలను ఏపీఈఎంసీఎల్ అంతర్గత వేదికలో పరిశీలించడంతో పాటు, వ్యర్థాల రవాణా, కదలికలను పర్యవేక్షించేందుకు వినియోగిస్తున్న జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను కూడా తనిఖీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశ్రమల ప్రాంగణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని పోలంరెడ్డి దినేష్ రెడ్డి సూచించారు. ఈ పరిశీలనలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఈఈ సుధా కురువ, ఏపీఈఎంసీఎల్ అధికారులు, సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

కడపలో 25న జాబ్ మేళా...!

జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి ఏ. సురేష్ కుమార్

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 23: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి ఏ. సురేష్ కుమార్ తెలిపారు. కడప నగరంలోని ఓ. బ్లాక్ కలెక్టరేట్ సముదాయంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. అపోలో ఫార్మసీస్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, ఏదైనా డిగ్రీతో పాటు ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. చిల్లర ఔషధ విక్రయ

రంగంలో 0 నుంచి 2 సంవత్సరాల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారి అనుభవం, పనితీరును బట్టి నెలకు గరిష్ఠంగా రూ.18 వేల వరకు వేతనం అందించడంతో పాటు ఉద్యోగ భద్రతకు సంబంధించిన వివిధ ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళా, పురుష అభ్యర్థులు తమ తాజా దరఖాస్తు వివరాలు, విద్యార్హతల ధ్రువపత్రాల నకళ్లతో నిర్ణీత తేదీ, సమయానికి జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నామని, అర్హతకు తగిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు హెల్ప్ సురేంద్రను 9247570780 నంబర్లో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి తెలిపారు.

కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

పరిశోధనల ఫలితాలు భేష్: కే.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీ బృందం

కడప జిల్లా, సెప్టెంబర్ 23 (మహి న్యూస్): కే.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీ బ్యాంకుకు చెందిన పరిశోధన భాగస్వాముల బృందం బుధవారం వైఎస్సార్ కడప జిల్లాలో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ అమలు తీరు, రైతుల అనుభవాలు, పంటల సాగు విధానాలు, ఆదాయ పరిస్థితులు, మార్కెట్ అనుసంధానం తదితర అంశాలను బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కే.ఎఫ్.డబ్ల్యూ. జర్మనీ ఆర్థికవేత్త బిరస్ హార్లర్, న్యూఢిల్లీ సీనియర్ నిపుణులు సంగీత అగర్వాల్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. పులివెందుల మండలంలోని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన అరటి సాగు క్షేత్రాలను బృందం సందర్శించింది. రసాయన వ్యవసాయ పద్ధతిలో, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న క్షేత్రాలను పరిశీలించి పంట నిర్వహణ, దిగుబడి, రైతుల అనుభవాలు, ఆదాయ పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎర్రం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు శివకుమార్ సాగు చేస్తున్న యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్ ప్రాజెక్ట్ పరిధిలోని అరటి క్షేత్రాన్ని పరిశీలించారు. అరటి కాండాన్ని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి వినియోగించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించే అవకాశాలపై చర్చించారు. రైతులను ప్రాసెసింగ్ కేంద్రాలు, మార్కెట్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచే అవకాశాలను పరిశీలించారు. తదుపరి పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఆఫ్ అగ్రోఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్లో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై కొనసాగుతున్న పరిశోధనలు, వాటి ఫలితాలు, రైతులకు అందుతున్న ప్రయోజనాలు, క్షేత్రస్థాయిలో పరిశోధన ఫలితాల వినియోగాన్ని అధికారులు వివరించారు. పరిశోధనల ద్వారా సాధిస్తున్న ఫలితాలను సంగీత అగర్వాల్ అభినందించారు. పరిశోధన సంస్థలు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు మార్గదర్శకుల మధ్య సమన్వయం పెంచడం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జర్మనీ బృందం రైతులు, శాస్త్రవేత్తలు, రైతు మార్గదర్శకులతో పరస్పర చర్చలు నిర్వహించింది. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జి. మురళీధర్, శివకుమార్, సుధాకర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంకేత భాష భావాలను వ్యక్తపరిచే శక్తివంతమైన భాష

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి

కడప, సెప్టెంబర్ 23 (మహి న్యూస్):: అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామజనేయపురం, చిన్నచౌక్లోని హెలెన్ కెల్లర్ హైస్కూల్లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రామ గోపాల్ సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకేత భాష కేవలం మాట్లాడటానికి ప్రత్యామ్నాయం మాత్రమే కాదని, భావాలు, ఆలోచనలు, హక్కులను వ్యక్తపరిచే శక్తివంతమైన భాష అని తెలిపారు. విద్యార్థులు తమను తాము తక్కువగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు, న్యాయం పొందే హక్కు ఉందని తెలిపారు. విద్యలో రాణించడంతో పాటు క్రీడలు, కళల్లో ప్రతిభను చాటుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా అధిగమించి

ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. న్యాయ సేవల సహాయవాణి 15100, బాలల సహాయవాణి 1098 గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది యం. చంద్రకాంతమ్మ, సహాయ న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు పి. మనోహర్, ఎ.ఎస్. రవితేజ, పాఠశాల కరస్పాండెంట్ పి. దౌలత్ ఖాన్, ప్రిన్సిపాల్ యం. మసూద బేగం, ఉపాధ్యాయులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయ సహాయక స్వచ్ఛంద కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

37 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

రూ.23.59 లక్షల విలువైన చెక్కులు అందజేత

కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబర్ 23 (మహి న్యూస్): జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.23,59,950 విలువైన చెక్కులను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

మండల డివిజనల్ అధికారి వెంగముని రెడ్డి,మండల పరిషత్ అధికారి జి. దామోదర్ రెడ్డి

గాలివీడు:సెప్టెంబర్23(మహి న్యూస్): మండల పరిషత్ కార్యాలయం నందు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లు, మండలంలోని స్థానిక సమస్యలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ అభివృద్ధి అధికారి వెంగముని రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అదేవిధంగా మండల పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలను అధికారులు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఉప మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 23: అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)పై వచ్చిన కోడిగుడ్లు, చిక్కీలకు సంబంధించిన ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ యూఎస్ఎఫ్ఐ, ఏఐఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం రాయచోటి నేతా సర్కిల్ ఎదురుగా ఉన్న జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు నల్ల రిబ్బన్లు పెట్టుకొని, చెవుల్లో పూలు పెట్టుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లవకుమార్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ కోడిగుడ్లు, చిక్కీల వ్యవహారంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంశాలపై కింది స్థాయి అధికారులతోనే విచారణ నిర్వహిస్తే వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి వచ్చే అవకాశం లేదన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యానికి విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి డిఇఓ పై ప్రభుత్వం కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించి, పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాలని కోరారు. ఒకే అధికారి జిల్లా డీఈవో, మదనపల్లె డిప్యూటీ డిఇఓ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ వంటి బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించడం వల్ల పరిపాలనా పరంగా ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం పరిశీలించాలని వారు కోరారు. ఈ అంశాలపై నిష్పక్షపాత విచారణ జరిపించి, తప్పు నిర్ధారణ అయితే సంబంధిత డీఈవో పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేశ్ రాయల్, శెట్టిపల్లి సాయి హేమంత్, మనోజ్, అఫ్రీద్, శోహిల్, తదితరులు పాల్గొన్నారు.

కడపలో ఆహార భద్రతపై విస్తృత తనిఖీలు.. డాక్టర్ హరిత

కడప మహి న్యూస్ సెప్టెంబర్ 23.: కడప నగర ప్రజల ఆరోగ్యంతో ఇంగువ మరియు మొదలైన మసాలాలతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఈరోజు కడప నగరంలోని మండి బజార్ తో పాటు పలు ప్రధాన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. హోల్ సేల్ డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ డిస్ట్రిబ్యూటర్లు, మసాలా దుకాణాలు మరియు అనుమానాస్పద గోడౌన్లపై ఆకస్మిక దాడులు చేశారు. ముఖ్యంగా ప్రజలు నిత్యం వాడే ఇంగువ,యల్ జీ ఇంగువ, కారం, పసుపు, ధనియాలు, గరం మసాలా వంటి ఇతర మసాలా దినుసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కల్తీ అనుమానం ఉన్న పలు శాంపిల్స్ ను సేకరించారు. సేకరించిన శాంపిల్స్ అన్నింటినీ పరీక్షల నిమిత్తం చెన్నై లోని ఫుడ్ ల్యాబ్ కు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ హరిత మరియు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఓ.వి. రాముడు మాట్లాడుతూ..

"ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత కల్తీ

కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు అమ్ముతున్నట్లు గమనిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వండి. బిల్లు తీసుకోవడం మర్చిపోవద్దు.

బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): జిల్లాలోని బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక భద్రతా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతా చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్తో కలిసి జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన 18 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల తీవ్రతను బట్టి తాత్కాలిక, దీర్ఘకాలిక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచలింగాల గ్రామ కూడలి వద్ద దీర్ఘకాలికంగా వాహనాల అండర్పాస్ ప్రతిపాదన ప్రక్రియలో ఉన్నందున అప్పటివరకు రిఫ్లెక్టివ్ పెయింట్తో స్పీడ్ బ్రేకర్లు, పెద్ద సూచిక బోర్డులు, సిమెంట్ బ్యారికేడ్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కేశవ్ గ్రాండ్ సమీపంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుత్తి ఫ్లైఓవర్ వద్ద సిమెంట్

బ్యారియర్లు, సూచిక బోర్డులు, విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల నుంచి నేరుగా జాతీయ రహదారులకు కలిసే కంకర రహదారుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రివేళల్లో స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించేలా తెల్లరంగు వేయడంతో పాటు సౌర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తడకనపల్లి కూడలి, చిన్నటేకూరు గ్రామం వద్ద యూ-టర్న్ ప్రాంతంలో వాహనాల అండర్పాస్ లేదా ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనులు ప్రారంభమైనందున నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాయకల్లు ఫ్లైఓవర్ వద్ద వెలుగుల సదుపాయం కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలను కేవలం గణాంకాలుగా చూడకుండా ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సున్నితంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ పరిధిలో పెండింగ్లో ఉన్న రహదారి గుంతల పూడ్చివేత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. రహదారుల పక్కన ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లు, వెంచర్ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నేరుగా జాతీయ రహదారులకు రోడ్డు అనుసంధానాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి కలెక్టరేట్ సముదాయం వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి హక్కుల బదిలీ, పరిహారం ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలు, ధాబాల వద్ద వాహనాల పార్కింగ్ పరిస్థితులపై రెవెన్యూ, పోలీసు, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే తొలగింపు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. హిట్ అండ్ రన్ కేసుల్లో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు.

బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరి

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 18 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల తీవ్రతను బట్టి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్అండ్బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, జాతీయ రహదారుల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సునీత, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలలకు ఉచిత న్యాయ సహాయం

సంకేత భాషపై అవగాహన అవసరం

బాలల హక్కులు, న్యాయ సేవలపై అవగాహన

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): కర్నూలు జిల్లా పరిషత్లో బాలల కోసం పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవల పథకం-2024పై న్యూ మాడ్యూల్ న్యాయ సేవల శిబిరం, అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి. వాసు మాట్లాడుతూ.. ప్రపంచ బధిర సమాఖ్య ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు న్యాయ సేవలు, రక్షణ, భద్రతకు సంబంధించి ఉచిత సహాయం అందించేందుకు న్యాయ

సేవల సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యా హక్కు, బాలల సహాయవాణి 1098, మహిళా సహాయవాణి 181, ఉచిత న్యాయ సహాయం 15100, దివ్యాంగుల సహాయవాణి 14456 తదితర సేవలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. వినికిడి లోపం ఉన్న బధిరుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, మానవ హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సంకేత భాషను సహజమైన, సంపూర్ణమైన ప్రామాణిక భాషగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. బధిరులకు ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ శాశ్వత లోక్ అదాలత్ పనితీరు, ప్రజలకు అందించే ప్రజోపయోగ సేవల గురించి వివరించారు. బాలల రక్షణ, విద్య, దివ్యాంగుల సంక్షేమం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ భద్రత తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం-2012, బాలల సంరక్షణ మరియు రక్షణ చట్టం-2015, పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 తదితర చట్టాలపై వివరించారు. కర్నూలు జిల్లాలోని భవిత కేంద్రాల ద్వారా బధిరులకు విద్య అందిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దివ్యాంగుల కోసం పలు పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. జిల్లాలో నాలుగు ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేసి సంకేత భాషపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ చేపడుతున్న చర్యలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, పిల్లల సైబర్ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన శాలలు

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మధ్యవర్తిత్వం, శాశ్వత లోక్ అదాలత్, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఔషధ నియంత్రణ శాఖ, ఈగల్ బృందం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శన శాలలను ఏర్పాటు చేశారు. ఆయా శాఖలు అందిస్తున్న సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సహాయంపై అవగాహన కల్పించారు.

అనంతరం నృత్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు రయిస్ ఫాతిమా, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రాంతీయ తనిఖీ అధికారి లాలేప్ప, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్, సర్వశిక్ష అభియాన్ అధికారులు, కార్మిక శాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు, ఈగల్ బృందం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రామయ్య నాయుడు, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం సూపరింటెండెంట్ హుస్సేన్ భాష, న్యాయ సేవల సభ్యుడు రాయపాటి శ్రీనివాసులు, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, బధిరులు, బధిర విద్యార్థులు పాల్గొన్నారు.

26న కర్నూలులో ఉద్యోగ మేళా

350 ప్రైవేటు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు
ఎస్ఎస్‌సీ నుంచి బీటెక్ వరకు విద్యార్హతలు
18 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులకు అవకాశం
రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): నైపుణ్యం, ఉపాధి మరియు శిక్షణ శాఖ కర్నూలు ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారిణి పి. దీప్తి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో ఎయిల్ డిక్సన్ టెక్నాలజీస్, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రాజెక్ట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 350 ఖాళీలు ఉన్నాయని, పురుషులు, మహిళలు ఇద్దరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలను బట్టి నెలకు సుమారు రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలకు తగిన ప్రైవేటు ఉద్యోగాలను పొందాలని పి. దీప్తి కోరారు. అభ్యర్థులు తమ వివరాలను జాతీయ ఉపాధి సేవల పోర్టల్ ౩౩౩.అ౦.ౖస౪జ.అఅ, ఆంధ్రప్రదేశ్ ఉపాధి శాఖ వెబ్‌సైట్ వఎజూశ్రీశీఎవత్.ఖజూ.ౖస౪జ.అఅలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

బయోచార్‌తో భూసార పరిరక్షణకు ప్రాధాన్యత

పంట అవశేషాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు విస్తృత అవగాహన
నంద్యాల జిల్లాలో తొలిసారిగా ప్రయోగాత్మక ప్రాజెక్టుకు కార్యాచరణ
శాస్త్రీయ పద్ధతుల్లో కార్యక్రమం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశం
భూసార పరిరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

నంద్యాల, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): భూసార పరిరక్షణతో పాటు పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. నంద్యాల జిల్లాలో తొలిసారిగా బయోచార్ వినియోగంపై ప్రయోగాత్మక కార్యక్రమాన్ని చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను, సంబంధిత కోర్ బృందం సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బయోచార్ వినియోగం, భూసార పరిరక్షణ, పంట అవశేషాల సద్వినియోగంపై సంబంధిత కోర్ బృందంతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. బయోచార్ తయారీ విధానం, వ్యవసాయ భూముల్లో దాని వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై చర్చించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి కార్బన్ ఉద్గారాలు పెరిగే అవకాశం ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునే ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. 'కోంటికి' వంటి పరికరాలను ఉపయోగించి ఆక్సిజన్ పరిమిత పరిస్థితుల్లో పంట అవశేషాలను ప్రాసెస్ చేసి బయోచార్‌గా మార్చే విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

బయోచార్‌ను తగిన మోతాదులో సేంద్రియ ఎరువులతో కలిపి వ్యవసాయ భూముల్లో వినియోగించడం ద్వారా నేల నాణ్యత, సేంద్రియ పదార్థాల స్థాయిని మెరుగుపరిచే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. భూసార పరిరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించి, దాని ఫలితాలను శాస్త్రీయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఫోర్ రెడ్డి ఫౌండేషన్, క్లైమిత్ర అండ్ సర్కులారిటీ బయో సంస్థల తరఫున జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టును అమలు చేసేందుకు రూపొందించాల్సిన ప్రతిపాదనలను వారం రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. కోర్ బృందం సభ్యులు అందించే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే మూడు నుంచి ఆరు నెలల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాన్ని అమలు చేసి, దాని ఫలితాలను అంచనా వేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. బయోచార్ నేలలో కార్బన్‌ను స్థిరీకరించడంతో పాటు దీర్ఘకాలికంగా నేల నాణ్యతను మెరుగుపరిచే సామర్థ్యం కలిగి ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్న నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా దీని వినియోగ సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా పంట అవశేషాల నిర్వహణ, భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణను అనుసంధానించే సమగ్ర చర్యగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత సంస్థల ప్రతినిధులు రాజశేఖర్ రెడ్డి, అంకిత శర్మ, రవిచంద్ర, నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, ఎల్‌డీఎం అయ్యప్ప రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్, కంటింజెంట్, దినసరి కూలీల వేతనాలు 5 శాతం పెంపు

కరువు, ఎల్‌నినో పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వేతనాల పెంపు
పెంచిన వేతనాలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు
వేతనాల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): కరువు, ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎన్ఎంఆర్, కంటింజెంట్, దినసరి కూలీల వేతనాలను ప్రస్తుతం ఉన్న మొత్తంపై మరో 5 శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్ఎంఆర్, కంటింజెంట్, దినసరి కూలీల వేతనాల పెంపుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర, అర్ధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కంటింజెంట్ కార్మికులు, ఎన్ఎంఆర్, దినసరి కూలీల జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని వేతనాలను 5 శాతం పెంచాలని సూచించారు.

కరువు పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పెంచిన వేతనాలను 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కమిషనర్ సీతాలక్ష్మి, రహదారులు-భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మహేశ్వర్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మనోహర్, కర్నూలు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 25లోగా బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తి చేసుకోవాలి

సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మె
సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం, 27న ఆదివారం వరుసగా ఐదు రోజులపాటు బ్యాంకు శాఖల కార్యకలాపాలకు అంతరాయం కలిగే అవకాశం
ఖాతాదారులు ముందస్తుగా ముఖ్యమైన లావాదేవీలు పూర్తి చేసుకోవాలని సూచన

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖాతాదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్ సూచించారు. సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం, 27న ఆదివారం కావడంతో 26 నుంచి 30 వరకు వరుసగా ఐదు రోజులపాటు సాధారణ బ్యాంకు శాఖల కార్యకలాపాలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు సాధ్యమైనంత వరకు అంతరాయం లేకుండా అన్ని బ్యాంకులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల చెల్లింపులకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ శాఖలు, పింఛను పంపిణీ అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమైన బ్యాంకు శాఖలు, నగదు పంపిణీ కేంద్రాల్లో ఖాతాదారుల అవసరాలకు సరిపడా నగదు అందుబాటులో ఉంచాలని, ఏటీఎంలు, నగదు రీసైక్లర్ యంత్రాల్లో ముందస్తుగా నగదు నింపి, అవసరమైనప్పుడు వెంటనే నగదు భర్తీ చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా బ్యాంకులు అంతర్గత ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ చెల్లింపుల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సమ్మె, వరుస సెలవుల విషయాన్ని ఖాతాదారులకు ముందుగానే తెలియజేసి, ప్రత్యామ్నాయ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని పి. మోహన్ కోరారు.

ప్రజలకు సూచన

కర్నూలు జిల్లా ప్రజలు సెప్టెంబర్ 25లోగా తమకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలని పి. మోహన్ సూచించారు. ముఖ్యంగా నగదు ఉపసంహరణలు, డిపాజిట్లు, చెక్కుల లావాదేవీలు, రుణ వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ మరియు ఇతర ముఖ్యమైన చెల్లింపులను చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని కోరారు. అత్యవసర అవసరాల కోసం ఏటీఎంలు, నగదు రీసైక్లర్ యంత్రాలు, యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ తదితర ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు చర్యలు చేపట్టి ఖాతాదారులకు అవసరమైన సహకారం అందించాలని పి. మోహన్ కోరారు.

ఆయుర్వేద వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలి

ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగం
ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
నాడీ పరీక్ష, ఎముకల సాంద్రత, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితం
ఒత్తిడిని నియంత్రించుకుని సమయానికి ఆహారం, తగిన విశ్రాంతి తీసుకోవాలి
వైద్యుల సూచనల మేరకే ఆయుర్వేద మందులు వినియోగించాలి

నంద్యాల, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగమని, సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ హాల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు ఆమెకు అవసరమైన మందులను అందజేశారు. ఆయుర్వేదం, ఆయుష్ వైద్య విధానాల ప్రాధాన్యతను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయాల్లో కూర్చుని పనిచేయడం, ఎక్కువ గంటలు పనిచేయడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, రాత్రివేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం వంటి అలవాట్ల వల్ల నడుము నొప్పి, డిస్క్ సంబంధిత సమస్యలు, జుట్టు రాలడం, గొంతు సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే స్వయంగా మందులు తీసుకోవడం, అవసరం లేకుండా ఎక్కువ మొత్తంలో మందులు కొనుగోలు చేసి వృథా చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు.

ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. ఆయుర్వేదం సహా వివిధ వైద్య విధానాలను వైద్యుల సలహాతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పసుపు, ఉసిరి వంటి సహజ పదార్థాలకు ఆయుర్వేదంలో ఉన్న ప్రాధాన్యతను కలెక్టర్ వివరించారు. ఆయుర్వేద ఔషధాలను కూడా వైద్యుల సూచనల మేరకే వినియోగించాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు కుటుంబ సమేతంగా ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యుల సలహాలు, అవసరమైన ఔషధాలను ఉచితంగా పొందాలని కోరారు. అనంతరం ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఒత్తిడిని నియంత్రించుకోవాలి

జిల్లా ఆయుష్ అధికారి యశోద మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ జీవనశైలి, ఒత్తిడి, హార్మోన్లలో మార్పుల కారణంగా ఎముకల సాంద్రత తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. నడుము, మెడ, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలితో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమని తెలిపారు. దీర్ఘకాలిక ఒత్తిడి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఒత్తిడిని నియంత్రించుకోవడం, తగిన విశ్రాంతి తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చే వారిలో నడుము, మెడ, మోకాళ్ల కీళ్ల నొప్పులు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. ఆరోగ్య సమస్యలకు స్వయంగా మందులు వినియోగించకుండా అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో నాడీ పరీక్ష, ఎముకల ఖనిజ సాంద్రత పరీక్ష, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలను నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆయుర్వేద, హోమియోపతి వైద్యులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు

మహిళా భద్రతపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన
గంజాయి సాగు, వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు
'ఆపరేషన్ త్రిశూల్' ప్రారంభం
300 మాదకద్రవ్య పరీక్షా పరికరాల్లో 114 మందికి పరీక్షలు
గంజాయి సమాచారాన్ని 1972 సహాయవాణికి తెలియజేయాలని సూచన

కర్నూలు, సెప్టెంబర్ 23: (మహి న్యూస్): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు 'ఆపరేషన్ త్రిశూల్' జిల్లాలో ప్రారంభించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌కార్డ్ సమావేశంలో మాదకద్రవ్యాల నియంత్రణ, గంజాయి సాగు, అక్రమ రవాణా నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం 'ఆపరేషన్ త్రిశూల్' పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ కలిసి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో తనిఖీలు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కలిసి 'వజ్ర ప్రహార్' సోదాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆటారు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే తోటలో సుమారు 10 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 300 మాదకద్రవ్య పరీక్షా పరికరాల్లో 114 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మాదకద్రవ్య వినియోగం గుర్తించిన వారిని అవసరాన్ని బట్టి కర్నూలు, విశాఖపట్నం, కోయంబత్తూరు డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డి-అడిక్షన్ కేంద్రంలో సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, బాధితులకు నిరంతర పర్యవేక్షణ, కౌన్సెలింగ్, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సంబంధిత అధికారులకు లేదా 1972 సహాయవాణికి తెలియజేయాలని కోరారు.

గ్రామస్థాయి వరకు మహిళా భద్రతపై అవగాహన

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలపై నేరాల నివారణతో పాటు గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యంగా ఆలయాలు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ ప్రాంతాల్లో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్వాక్రా, మెప్మా, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలు, మహిళా పోలీసులు, ప్రధానోపాధ్యాయులు తదితర విభాగాలను భాగస్వామ్యం చేసి గ్రామస్థాయి వరకు కార్యక్రమాలను విస్తరించాలని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, గ్రామస్థాయి సమావేశాల ద్వారా భద్రత చర్యలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో లేదా వచ్చే నెలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై ఈగల్ బృందం కార్యక్రమాలు

మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకు ఐదు పల్లెబాట కార్యక్రమాలు, 13 మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. లీప్ యాప్ ద్వారా వచ్చిన రెండు ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు. 1972 సహాయవాణికి వచ్చిన రెండు ఫిర్యాదుల్లో ఒక కేసులో కౌన్సెలింగ్ అందించగా, మరో కేసులో గంజాయికి బానిసైన వ్యక్తిని డి-అడిక్షన్ కేంద్రంలో చేర్పించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంచేందుకు 'ఈగల్ ఏపీ 1972 కర్నూలు' పేరుతో సామాజిక మాధ్యమ పేజీని ప్రారంభించి, మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన చిన్న వీడియోలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మాదకద్రవ్యాల నియంత్రణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శాంతి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డీఈఓ సుధాకర్, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, బీసీ సంక్షేమ అధికారి ప్రసన్న, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com